క్లుప్తంగా

అనాథ శవానికి అంత్యక్రియలు



వందనం చేస్తున్న కాటికాపరులు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని కాల్వొడ్డు మహాప్రస్థానం హిందూ శ్మశానవాటికలో ఆదివారం కాటికాపరి జాంబవంతుడు సొసైటీ ఆధ్వర్యాన కాటికాపరులు ఓ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. త్రీటౌన్ ఏరియాలో అనారోగ్యంతో బాధపడుతూ రోడ్డు వెంట ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. దీంతో స్థానికులు అందించిన సమాచారం మేరకు కాటికాపరులు సొంత ఖర్చుల తో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి బాలు మాట్లాడుతూ.. నగరంలో అనాథశవాలు ఎక్కడ కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.సైదులు, పడిశాల వీరస్వామి, చుక్కయ్య, కె.కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించే వరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న బషీరుద్దీన్

తిరుమలాయపాలెం: నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారిందని, ధరలు తగ్గించి సామాన్య ప్రజలను ఆదుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా నాయకుడు షేక్ బషీరుద్దీన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్యభవన్‌లో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 1 నుంచి 7 వరకు మండల వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీను, నాయకులు బింగి రమేష్, సురేష్, రేపాకుల వెంకన్న, మంగపతి, పద్మనాభుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఖమ్మం వైద్యవిభాగం: జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మయూరిసెంటర్‌లోని సాయిరాం గ్యాస్ట్రో లివర్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రంటాలజిస్ట్ జంగాల సునీల్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు లివర్ ఫైబ్రో స్కానింగ్, హెపటైటీస్ బీ,సీ రక్త పరీక్షలు, షుగర్, హెపటైటీస్ బీ వ్యాక్సినేషన్, మందులు, ఓపీ ఉచితంగా అందించారు. పరీక్షల్లో హెపటైటీస్ పాజిటీవ్‌గా ఇద్దరిని గుర్తించగా, లివర్ ఫైబ్రో స్కానింగ్ 56 మందికి నిర్వహించారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రతీ నెల మొదటి, మూడో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జంగాల శ్రీధర్, జంగాల స్వాతి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ రఘునాథపాలెం: ఖమ్మం విద్యుత్ డివిజన్ పరిధిలోని రఘునాథపాలెం, కొత్త లింగాల విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందనిడీఈ ఎన్.రామారావు, ఏఈ ఇందిరా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపాలెం సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు, కొత్త లింగాల 33 కేవీ ఫీడర్ రోడ్డు వెడల్పు పనులు నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. రఘునాథంపాలెం ప్రాంతం, కేసీఆర్ కాలనీ, కేటీఆర్ కాలనీ, కోయచెలక, రేగులచెలక, ప్రగతిప్రైడ్, రఘునాథపాలెం పై కాలనీ, దారేడు, శివాయిగూడెం, పువ్వాడ ఉదయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఖుషి
వినోద	జైలర్
సాయిరాం	బెదురులంక 2012
ఆదిత్య	ఖుషి
శ్రీనివాస	ఖుషి
సుందర్	ఖుషి

- ఖమ్మంగాంధీచౌక్

సరికొత్త సొబగులు..!



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ప్రభుత్వ బాలికల కళాశాలకు అదనపు తరగతి గదులు

- కలెక్టర్ చొరవతో రూ.25లక్షలు కేటాయింపు
- కొనసాగుతున్న నిర్మాణ పనులు
- ఇక దూరం కానున్న ఇరుకు చదువులు



నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్న క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం సైతం తమవంతుగా సహకరిస్తూ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోంది. ఈ క్రమంలో కలెక్టర్ వీ.పీ. గౌతమ్ నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అదనపు తరగతి గదులు అవసరం అవుతున్నాయని గుర్తించి తన నిధుల నుంచి రూ.25 లక్షలను కళాశాలకు అందించారు. దీంతో అక్కడ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

కలెక్టర్ సందర్శనతో వెలుగులోకి..

కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కళాశాలను సందర్శించిన సమయాన అక్కడ కళాశాలకు కావాల్సిన అదనపు తరగతి గదులు విషయమై వివరాలు తెలుసుకున్నారు. అక్కడి పరిస్థితులను గమనించిన ఆయన రెండు అదనపు తరగతి గదులకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. తక్షణమే ఆ నిధులు కేటాయించడంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కళాశాలకు మొత్తం 28 తరగతి గదులు అవసరం అవుతుండగా... ప్రస్తుతం 12 గదులే ఉన్నాయని, కలెక్టర్ చొరవతో రెండు గదులు నిర్మాణంలో ఉన్నాయని, అవి సుమారు మూడు నెలల్లో అందుబాటులోకి రానున్నట్లు కళాశాల అధ్యాపకులు చెబుతున్నారు.

జిల్లాలోనే ఏకైక కళాశాల..

జిల్లాలోని ఏకై క ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఖమ్మం నగరంలోనే ఉంది. ఈ కళాశాలలో 1,052మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా.. ఇందులో ప్రథమ సంవత్సరం 452, ద్వితీయ సంవత్సరం 600 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ కళాశాలలో నాలుగు జనరల్ కోర్సులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ ఉండగా... ఒకేషనల్‌లో ఇన్సూరెన్స్ అండ్ మేనేజ్‌మెంట్(ఐఎం), ప్రీ స్కూల్ టీచర్ ట్రెనింగ్(పీఎస్‌టీటీ), ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, ఓఏ(ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టైప్), కంప్యూటర్ సైన్స్(సీఎస్ఈ) వంటి ఆరు కోర్సులున్నాయి. ఇన్ని రకాల కోర్సులు ఉన్న బాలికల కళాశాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల విద్యార్థినులు సైతం ఇక్కడ చదివేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు.

నిర్మాణ దశలో తరగతి గదులు..



కలెక్టర్ గౌతమ్ కళాశాలను సందర్శించిన సమయాన కళాశాలకు అదనపు తరగతి గదులకు నిధులు మంజూరు చేశారు. అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీని ద్వారా విద్యార్థినులకు ఉపయోగం జరగనున్నది.

– బిక్కుమళ్ల అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఖమ్మం

బీఆర్‌ఎస్‌ను మళ్లీ ఆశీర్వదించండి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్‌ఎస్ పార్టీని ముచ్చటగా మూడోసారి ఆశీర్వదించాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. ఆదివారం త్రీటౌన్‌లో మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలుకగా.. మంత్రి మాట్లాడారు. త్రీటౌన్‌లో దాదాపు 12 డివిజన్ల గుండా గోళ్లపాడు చానల్ ద్వారా పారే మురుగును తొలగించి శాశ్వత పరిష్కారం చూపించామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన గౌతమ్, టి.మహేష్, షేక్.పాషా, ఉపేందర్, పెద్దపల్లి నాగేశ్వరావుతో పాటు పలువురికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ లక్ష్మి, ఏఈ కృష్ణలాల్, డీఈలు నవ్యజ్యోతి, స్వరూపరాణి, కొడి లింగయ్య, దడాల రఘు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రభుత్వం చేయూత..

ఖమ్మంగాంధీచౌక్: పేద, చిరు వ్యాపారుల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తుందని మంత్రి అజయ్‌కుమార్ తెలిపారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఖమ్మం త్రీటౌన్ వ్యవసాయ మార్కెట్ రోడ్డులో ఆదివారం రాత్రి నిర్వహించిన చిరు వ్యాపారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించి హ్యాట్రిక్ కొట్టేందుకు చిరు వ్యాపారులు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు. సంఘ అధ్యక్షుడు మిట్టపల్లి రవికుమార్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు యర్రా అప్పారావు, పత్తిపాక రమేష్ వేముల శ్రీలత, ఆత్మకూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన పువ్వాడ..



బోనమెత్తిన మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 17వ డివిజన్‌లో ఆదివారం కార్పొరేటర్ ధనాల రాధ, నాయకుడు ధనాల శ్రీకాంత్ అధ్వర్యాన మహిళలు ముత్యాలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు నిర్వహించారు. కాగా, ఈ కార్యక్రమానికి మంత్రి అజయ్‌కుమార్, మేయర్ నీరజలు పాల్గొని బోనం ఎత్తారు. డప్పువాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి ప్రదర్శనగా వెళ్లి మొక్కులు సమర్పించారు. అనంతరం ముత్యాలమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాక నగరంలోని 22వ డివిజన్ పార్శిబంధంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న బేడ బుడగ జంగాల కమిటీ హాల్ పునరుద్ధరణ పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పువ్వాడను గజమాల, టోపీ తో బుడగ జంగాల నాయకులు అభిమానంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్, సుడా చైర్మన్‌లతో పాటు కార్పొరేటర్ పల్లా రోజ్‌లీన తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటించిన ఎంపీ నామ



సరళాదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నామ

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నాయకుడు, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం నగరంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గుట్టల బజార్‌లో ఇటీవల మృతిచెందిన యలమంచిలి సరళాదేవి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నగరంలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాళ్లూరి హరీష్ తండ్రి తాళ్లూరి మల్లేశ్వరరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి, తాళ్లూరి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, జర్పుల వెంకన్న, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



సాయినగర్‌లో శంకుస్థాపన చేస్తున్న కందాళ

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి:మండలాల్లో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఖమ్మంరూరల్ మండలంలోని సాయినగర్‌లో నూతనంగా రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఆర్ఎస్‌నగర్‌లో రూ.10లక్షలతో, సాయిప్రభాత్‌నగర్ 2లో రూ.24లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంగళగూడెం, గుర్రాలపాడులలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముత్తగూడెం, కైకొండాయిగూడెంలలో ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాల వారిని పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే నేలకొండపల్లి మండలంలోని కోనాయిగూడెం, రాయగూడెం, అప్పలనరసింహాపురం తదితర గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతిచెందిన మృతుల కుంటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్, శ్రీనివాసరావు, లక్ష్మ ణ్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు..

పెద్ద వెంకయ్యకు తమ్మినేని..

తిరుమలాయపాలెం: మండలంలోని తాళ్లచెరువులో గడుపూడి పెద్ద వెంకయ్య సతీమణి ఉషారాణి ఆకస్మికంగా మృతిచెందడంతో సమాచారం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీను మండల నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు, సురేష్, మహేందర్, వీరన్న, వెంకన్న, ఉపేందర్, దామోదర్ తదతరులు పాల్గొన్నారు.

పిండిప్రోలువాసికి నాయకులు..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన రామనబోయిన శ్రీను గుండెపోటుతో మృతిచెందడంతో పలు పార్టీల నేతలు నివాళులర్పించారు. ఆదివారం పిండిప్రోలులో శ్రీను మృతదేహాన్నిఇప్టూ జాతీయ కార్యదర్శి పి.ప్రసాద్, ఎన్డీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం భారీ ఊరేగింపుతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.


స్వాతంత్య్రం సమరయోధుడికి మాజీ మంత్రి..



జనార్థన్‌రావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి సంభాని

నేలకొండపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు కొత్తా జనార్థన్‌రావు సతీమణి సుశీల ఇటీవల మృతి చెందగా.. ఆదివారం మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ మృతురాలి స్వగృహంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ మీసా ముత్తయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొత్తా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వెంకన్న, మాజీ ఎంపీటీసీ మక్తాల రామకృష్ణ, వివిధ పార్టీల నాయకులు అనంతు సత్యనారాయణ, కొత్తా శేఖర్, కొత్తా వేణు తదితరులు పాల్గొన్నారు.

చలోహైదరాబాద్‌కు తరలిన పద్మశాలీలు..



తరలివెళ్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

రఘునాథపాలెం: పద్మశాలీల సంఘం పిలుపు మేరకు మండలంలోని వేపకుంట్ల, చిమ్మపుడి తదితర గ్రామాల నుంచి పద్మశాలీలు ఆదివారం ప్రత్యేక బస్సు ద్వారా హైదరాబాద్‌కు తరలివెళ్లారు. పద్మశాలీ రాజకీయ శంఖారావం మీటింగ్‌కు తరలివెళ్లి పద్మశాలీలకు టికెట్ ఇవ్వాలని కోరారు. కాగా, పద్మశాలీ కులస్తులు, సంఘం నాయకులు మేక పిచ్చయ్య, శ్రీను, కనకయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు ఆధ్వర్యాన పద్మశాలీలు తరలివెళ్లారు.

ఖమ్మం అసెంబ్లీ సీటును మైనార్టీలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం అసెంబ్లీ సీటును మైనార్టీలకు ఇవ్వాలని నగర మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మైనార్టీల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఖమ్మం అసెంబ్లీ పరిధిలో మైనార్టీలకు చెందిన ఓట్లు 60 వేలు పైన ఉన్నాయని తప్పకుండా కాంగ్రెస్ పార్టీ తరఫున మైనార్టీలకు ఇవ్వాలని కోరారు. గత పదేళ్ల నుంచి ఏదో ఒక కారణంతో మైనార్టీలు సీటు త్యాగం చేస్తున్నారని ఈసారైనా మైనార్టీ అభ్యర్థికి ఇచ్చేలా అధిష్టానం నిర్ణయించాలని ముస్లింలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థిగా మైనార్టీలు నగర అధ్యక్షుడు మహమ్మద్ జావిద్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చోటా బాబు దరఖాస్తు చేసుకోగా ఎవరికీ ఇచ్చినా పార్టీకి కట్టుబడి ఉండడంతో పాటు అభ్యర్థి గెలుపు కోసం అహర్నిషలు కృషి చేస్తామని తెలిపారు. ఇందు కోసం రాష్ట్రవ్యాప్త ముస్లిం మైనార్టీ పెద్దలు అందరూ కలిసి ఏఐసీసీ నాయకులు, తెలంగాణ ఇన్‌చార్జ్, టీపీసీసీ అధ్యక్షుడు సీఎల్పీ లీడర్‌కు ఓ మెమోరండం అందజేయనున్నట్లు చెప్పారు. నగర అధ్యక్షుడు జావిద్ సమక్షంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చోటా బాబు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్, రబ్బాని, గౌస్, అబ్బాస్ తదితర నగరం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖమ్మంసహకారనగర్: మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల చేసిన విధంగా గురుకుల ఉపాధ్యాయులకు కూడా విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని, ఐక్య గురుకులాల రాష్ట్ర కన్వీనర్ ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోఇన సంఘం కార్యాలయంలో పారుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గురుకుల ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని, నైట్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ప్రత్యేక వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, పారిటీ స్కేల్స్ అమలు చేయాలని, వేధింపులు అరికట్టాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ గురుకుల కన్వీనర్‌గా పి.శ్రీనివాసరావుని, కో కన్వీనర్‌గా ఈశ్వరి, ప్రమీల తదితరులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు, గురుకుల సబ్ కమిటీ కన్వీనర్ బుర్రి వెంకన్న, బీసీ గురుకుల కన్వీనర్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు నవీన్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చల్లంగ చూడమ్మ తల్లీ..

నిజ శ్రావణం ఆదివారం కావటంతో ఎక్కడ చూసినా బోనాల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ అమ్మవార్లకు, గంగమ్మతల్లికి భక్తులు బోనాలను మోసుకొని దప్పుచప్పుళ్లు, డీజే సౌండ్స్‌తో చేరుకొని మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి చల్లగ చూడాలని, సకల ఐశ్వర్యాలు ప్రసాదించాలని పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తుల రాకతో గ్రామాలు, నగరాల్లో సందడి వాతావరణం కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: బల్లేపల్లిలో బోనాలతో ఊరేగింపుగా మొక్కులు చెల్లించడానికి వెళ్తున్న భక్తజనం



ఖమ్మంగాంధీచౌక్: శ్రీనివాస్‌నగర్ నుంచి బోనాలతో వస్తున్న మహిళలు



నేలకొండపల్లి: కోనాయిగూడెంలో గొర్రెలు, కోళ్లు బలిచ్చి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ఖమ్మంరూరల్: రెడ్డిపల్లిలో నృత్యాలు చేస్తూ బోనాలతో వెళ్తున్న శివసత్తులు



ఖమ్మం మామిళ్లగూడెం: గంగపుత్ర బెస్త సంఘం ఆధ్వర్యంలో బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



ఖమ్మంగాంధీచౌక్: మోతీనగర్ ప్రాంతంలో బోనాలతో వస్తున్న భక్తులు

అటెన్షన్ ప్లీజ్

కంపు కొడుతోంది..!



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఆస్పత్రిలో పేరుకుపోయిన వ్యర్థాలను సంచులుగా కట్టి వెనుక ప్రాంతంలో ఇదిగో ఇలా పడేస్తుండగా.. వారానికైనా తరలించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఏ రోజుకు ఆ రోజు వ్యర్థాలు తరలించే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వ్యర్థాలు కుళ్లిపోయి కంపుకొడుతోంది. దీంతో పాటు దోమలు వృద్ధి చెంది రోగులకు ప్రాణసంకటంగా తయారైంది. ఆస్పత్రి అనుసంధానంగా మెడికల్ కళాశాల ప్రారంభం కావొస్తున్నా పారిశుద్ధ్య నిర్వహణలో మాత్రం నిర్లక్షం వీడట్లేదు. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టర్ పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటి కప్పుడు తరలించాలని కోరుతున్నారు.

- ఖమ్మం వైద్యవిభాగం